సాక్షి
నిజామాబాద్
శనివారం । 20 । ఏప్రిల్ । 2024



కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



బోధన్-బీదర్ రైల్వేలైన్‌కు కృషి

బోధన్ – బీదర్ రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.4 /29.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'జహీరాబాద్'లో రెండోరోజు ముగ్గురి నామినేషన్లు

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం రెండో రోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తొలిరోజు కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలైన విషయం తెలిసిందే. రెండోరోజు స్వతంత్ర అభ్యర్థులు బిర్దార్ మారుతీరావ్, కమ్మరి ఆనందీశ్వర్ ఒక్కో సెట్టు చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. అలాగే మటం మహదేవ్ స్వామి రెండు సెట్ల నామినేషన్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు నామినేషన్లను స్వీకరించారు.

22 వరకు పాలీసెట్ దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్: పాలీసెట్ పరీక్ష కోసం ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాంకుమార్ శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 250 అపరాధ రుసుముతో, ఇతరులు రూ. 500 అపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చే నెల 24వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అమర్నాథ్ యాత్రికులకు మెడికల్ సర్టిఫికెట్

నిజామాబాద్‌నాగారం: అమర్నాథ్ యాత్రికులు వారికి కావాల్సిన మెడికల్ సర్టిఫికెట్‌ను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పొందవచ్చని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. మెడికల్ క్యాంపునకు హాజరై తీసుకోవాలని సర్టిఫికెట్ తీసుకోవాలని పేర్కొన్నారు. ట్రావెల్ ఏజెన్సీలు, ఇతర వ్యక్తులు ఇచ్చే సర్టిఫికెట్లు తీసుకోవద్దని తెలిపారు. జీజీహెచ్‌లో పూర్తిగా ఉచితంగా మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు జూనియర్ అసిస్టెంట్ ఫోన్ నంబర్ 8247853678లో సంప్రదించాలన్నారు.

ఇందూరు అందరిది!



హరీశ్‌చంద్ర హెడా | ఎం.నారాయణరెడ్డి | ఎం.రాంగోపాల్ రెడ్డి | టి.బాలాగౌడ్ | గడ్డం గంగారెడ్డి | ఆత్మచరణ్‌రెడ్డి | మధుయాష్కీగౌడ్ | కల్వకుంట్ల కవిత | ధర్మపురి అర్వింద్

- అన్ని పార్టీలను ఆదరించిన పార్లమెంట్ ఓటర్లు
- ఎంపీగా హ్యాట్రిక్ కొట్టిన ఇద్దరు నేతలు
- ఇండిపెండెంట్‌నూ గెలిపించిన ప్రజలు
- 1952లో తొలిసారి ఎన్నికలు
- 2019 ఎన్నికల బరిలో 185 మంది
- దేశంలో హాట్‌టాపిక్‌గా మారిన నిజామాబాద్ పేరు

నిజామాబాద్ లోక్‌సభ స్థానం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా ఓటర్లు అన్ని పార్టీలను ఆదరించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిని సైతం గెలిపించిన చరిత్ర ఇందూరుది. ఇద్దరు నేతలకు ప్రజలు హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టారు. అయితే ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 11 సార్లు కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించింది. 1952లో తొలిసారి ఎన్నికలు జరగగా.. 1967 మినహా.. 1991 వరకు హస్తం పార్టీ హవాయే కొనసాగింది. అనంతరం టీడీపీ ఏర్పాటుతో ఆ పార్టీ విజయపరంపరకు గండిపడింది. 1996లో, 2004, 2009లో మళ్లీ గెలిచినా.. తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిస్థితి మారిపోయింది. 2014 బీఆర్ఎస్, 2019లో బీజేపీ గెలుపొందాయి.



నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఆ సమయంలో 3,35,863 మంది ఓటర్లు ఉన్నారు. మొదట్లో ఈ నియోజకవర్గం పరిధిలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు ఉండేవి. 2009లో ఏర్పడిన నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు కొత్తగా ఏర్పడిన జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోకి వెళ్లాయి. దీంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోకి వచ్చాయి. దీంతో నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో ప్రస్తుతం నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం 14,96,593 మంది ఓటర్లు ఉన్నారు.

17 సార్లు జరిగిన ఎన్నికల్లో గెలుపు వీరిదే..

నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి మొదటిసారిగా 1952లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇక్కడ బోణీ కొట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా పీడీఎఫ్(పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థులు విజయం సాధించగా.. నిజామాబాద్‌లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి హరీశ్‌చంద్ర హెడా విజయం సాధించాడు. 1957, 1962లో జరిగిన వరుస ఎన్నికల్లో ఆయనే విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేసుకున్నారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఎం.నారాయణరెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 1971, 1975, 1980లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రాంగోపాల్ రెడ్డి హ్యాట్రిక్ విజయాలు సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత 1984, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన టి.బాలాగౌడ్ వరుసగా రెండుసార్లు గెలుపొందారు. 1991లో టీడీపీ అభ్యర్థి గడ్డం గంగారెడ్డి విజయం సాధించగా, 1996లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్మచరణ్‌రెడ్డి గెలిచారు. 1998, 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అయిన గడ్డం గంగారెడ్డి విజయం సాధించారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మధుయాష్కీగౌడ్ తొలిసారి గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగగా.. జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు నిజామాబాద్ పరిధిలోకి వచ్చి చేరాయి. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మరోసారి పోటీ చేసిన మధుయాష్కీ గౌడ్‌ను ప్రజలు గెలిపించారు.

తెలంగాణ ఏర్పాటు తర్వాత మారిన పరిస్థితి

2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. నాడు జరిగిన ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత బరిలో నిలిచి విజయం సాధించారు. బీఆర్ఎస్ పార్టీ బోణీ కొట్టింది. ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. దీంతో ఉత్తర తెలంగాణ జిల్లాలో ఇందూరు లోక్‌సభకు రాజకీయ ప్రాధాన్యం నెలకొంది. ఇక 2019లో జరిగిన ఎన్నిక చరిత్రలో నిలిచిపోయింది. ఈ ఎలక్షన్ దేశం దృష్టిని నిజామాబాద్ వైపు తిప్పింది. ఈ నియోజకవర్గం నుంచి మొత్తం 185 మంది పోటీ చేశారు. దీంతో ప్రత్యేకంగా బెంగళూరు నుంచి ఈవీఎంలను తెప్పించి ఎన్నికలు నిర్వహించారు. పసుపు బోర్డు ఏర్పాటు డిమాండ్‌తో 173 మంది రైతులు నామినేషన్ వేసి పోటీకి దిగారు. ఇక బీఆర్ఎస్ నుంచి రెండో సారి కవిత బరిలో దిగగా.. కాంగ్రెస్ నుంచి మధుయాష్కీ పోటీలో నిలిచారు. తొలిసారి ధర్మపురి అర్వింద్ బీజేపీ నుంచి ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించారు. ఇక ప్రస్తుతం 18వ సారి ఎన్నికలు జరుగుతుండగా బీజేపీ నుంచి మరోసారి అర్వింద్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ బరిలో నిలిచారు. మే 13న పోలింగ్ జరుగనుంది. జూన్ 4న కౌంటింగ్ జరుగనుండడంతో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరు పరిశీలన



ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును పరిశీలిస్తున్న అబ్జర్వర్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును వ్యయ పరిశీలకులు డీఎం నిమేజీ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాధవనగర్, ఇందల్వాయి తదితర ప్రాంతాల్లో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు నిర్వహిస్తున్న తనిఖీలు, ఇతర కార్యకలాపాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. అలాగే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, గట్టి నిఘా కొనసాగించాలని ఈ సందర్భంగా అబ్జర్వర్ సూచించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య తదితరులున్నారు.

21న టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: టీఎస్ ఆర్‌జేసీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ కోసం 32 సెంటర్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం 7,607 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈవో సూచించారు. పూర్తి వివరాలకు 99854 32021 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వడగళ్ల వాన బీభత్సం



వల్లభాపూర్‌లో ధాన్యం కుప్పలో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- నీటమునిగిన కల్లాలు, తడిసిన ధాన్యం, రాలిన మామిడి కాయలు
- ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురు గాలులకు వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. కోతకొచ్చిన మామిడి కాయలు రాలిపోయాయి. ఉరుములు మెరుపులతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్‌లో మూడు గేదెలు చనిపోయాయి. పలు మండలాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. వడగళ్లు, గాలుల ప్రభావంతో వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. పలు మండలాల్లో కోతదశకు వచ్చిన వరి గింజలు రాలిపోయాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకా 25 శాతం పంట కోయాల్సి ఉంది. అకాల వర్షానికి వెయ్యి ఎకరాలకు పైగా వరికి నష్టం జరిగే అవకాశముందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఎదిగిన నువ్వు పంట దెబ్బతిన్నది. కల్లాల్లో ఆరబోసిన వరిధాన్యం తడిసి ముద్దయింది. వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్లు గాలులకు కొట్టుకుపోయాయి. వడగళ్ల వర్షానికి ఇందల్వాయి, ధర్పల్లి, నందిపేట్, మాక్లూర్, డొంకేశ్వర్, మోపాల్, ఆలూర్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, రెంజల్ మండలాల్లోని కల్లాలు నీటమునిగాయి. పలుచోట్ల వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. వారం రోజులుగా అకాల వర్షాలు పంటలను వెంటాడుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు తడిసిన వడ్లకు మొలకలు వచ్చే అవకాశముంది. కల్లాల్లో నేడో, రేపో అమ్ముడుపోయే ధాన్యం పూర్తిగా తడిసిముద్ద కావడంతో రంగుమారిన పంటను ఎలా అమ్ముడుపోతుందోనని రైతులు దిగులు చెందుతున్నారు. వర్షానికి నేల మెత్తగా మారడంతో వరికోతలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి.



గన్నారంలో నేలకొరిగిన చెట్టు, వంగిన స్తంభం

30 రోజుల్లో మూడుసార్లు...

గత 30 రోజుల్లో మూడుసార్లు వడగళ్ల వర్షం పంటలను దెబ్బతీసింది. మార్చి 16న కురిసిన వానకు జిల్లాలో 6,058 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ నెల 8న కురిసిన వర్షానికి 1,726 ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. ప్రస్తుతం కురిసిన వడగళ్ల వానకు వరి, మామిడి, నువ్వు పంటలకు భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. వ్యవసాయాధికారులు శనివారం పంటనష్టం వివరాలను సేకరించనున్నారు.

విద్యుత్ శాఖకు రూ.50 లక్షల ఆస్తి నష్టం

నిజామాబాద్‌నాగారం: వడగళ్ల వానతో విద్యుత్ శాఖకు సుమారు రూ. 50 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్ఈ రవీందర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు, వడగళ్లకు గంటల వ్యవధిలో 10 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 150 వరకు విద్యుత్ స్తంభాలు, వైర్లు దెబ్బతిన్నాయి. కరెంట్ సరఫరాలో ఇక్కట్లు రావడంతో అధికారులు, విద్యుత్ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. సాయంత్రం 5 గంటల నుంచే విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనిలో పడ్డారు. పట్టణాల్లో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పల్లెల్లో అర్ధరాత్రి వరకు కరెంట్ సరఫరా అందిస్తామన్నారు.



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అర్వింద్, బాజిరెడ్డిల నామినేషన్



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

- రెండో రోజు ఆరుగురి నామినేషన్
- ఇప్పటి వరకు 8 మంది అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి రెండోరోజు శుక్రవారం ఆరుగురు అభ్యర్థులు మొత్తం ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. వీరితోపాటు బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా రాపెల్లి శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా రాగి అనిల్, నామినేషన్ పత్రాలు సమర్పించారని రిటర్నింగ్ అధికారి వివరించారు. కాగా రెండు రోజులకు మొత్తం మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు.

బీఆర్ఎస్ అభ్యర్థి రెండు సెట్ల నామినేషన్

బీఆర్ఎస్ బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలుచేశారు. బిగాల గణేశ్‌గుప్తా కారు నడపగా, అభ్యర్థి బాజిరెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ సురేశ్ రెడ్డితో కలిసి ఒక సెట్ నామినేషన్ వేశారు. మరో సెట్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో పాటు జగిత్యాల్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, బోధన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి అయేషా ఫాతిమాతో కలిసి దాఖలు చేశారు. బాజిరెడ్డి కుటుంబ సభ్యులతో నామినేషన్ కేంద్రానికి చేరుకున్నా.. ఈసీ నిబంధనల మేరకు వారు బయటే వేచి ఉన్నారు.

పసుపు రైతులతో కలిసి బీజేపీ అభ్యర్థి..

బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పసుపు రైతులతో కలిసి మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మెడలో పసుపు కొమ్ముల దండ, స్వయంగా కారు నడుపుతూ అర్వింద్ నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. పసుపు రైతుల సమక్షంలో, వారి ఆశీర్వాదంతో మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. పసుపు రైతులు సమకూర్చి ఇచ్చిన డబ్బుతో నామినేషన్ డిపాజిట్ చెల్లించానని, చాలా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైతులు పండించే పసుపు, వరి, మామిడి, మొక్కజొన్న, చెరుకు, ఇతరత్రా పంటలకు విత్తనాల నుంచి మార్కెటింగ్ సౌకర్యం వరకూ అన్ని చర్యలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయా పంటల ప్రాసెసింగ్, ప్యాకేజీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని, స్వయం ఉపాధి మహిళలకు వాల్యూయాడెడ్ సర్వీస్‌లో భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. దేశాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తామని, తద్వారా యువతకు ఉపాధి పెరుగుతుందని తెలిపారు. గల్ఫ్ వలసలు ఆపుతామని, అక్కడ ఉన్న వారందరికీ ఉపాధి కల్పించి వాపస్ వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పసుపు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నెండేళ్ల కల నెరవేరింది

- ఆరేళ్ల శ్రమ ఫలితమిది
- ఐపీఎస్ ఆఫీసర్ కావాలన్న లక్ష్యంతో చదివా..
- చివరి ప్రయత్నంలో సక్సెస్ అయ్యా
- అమ్మానాన్నల త్యాగాలు మరువలేనివి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో సివిల్స్ విజేత రజనీకాంత్

సాక్షి, కామారెడ్డి: 'ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు ఏపీ ఆర్‌జేసీలో స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించా. నాగార్జునసాగర్‌లోని రెసిడెన్సియల్ కాలేజీలో సీటు వచ్చింది. 2012లో డిగ్రీ చదువుతున్నప్పుడు వ్యాస రచన పోటీలో 'నా భారతం.. అమర భారతం' అన్న వ్యాసం రాయగా స్టేట్ ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. అందరూ దేశానికి ఉపయోగపడతావంటూ మెచ్చుకున్నారు. ఐపీఎస్ కావాలని ఆరోజే నిశ్చయించుకున్నాను. పన్నెండేళ్ల నాటి కల ఇప్పుడు నిజం అయ్యింది'' అని సివిల్స్‌లో 587 ర్యాంకు సాధించిన ఆర్.రజనీకాంత్ పేర్కొన్నారు. ఆరో ప్రయత్నంలో విజయం సాధించానన్నారు. ఐపీఎస్‌కు సెలెక్ట్ అయిన రజనీకాంత్‌ను శుక్రవారం కామారెడ్డి కల్కినగర్‌లోని ఆయన ఇంట్లో 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా రజనీకాంత్ తన సక్సెస్ వెనక శ్రమను, తన కోసం కుటుంబం చేసిన త్యాగాలను వివరించారు. రజనీకాంత్ తెలిపిన వివరాలు..

కుటుంబ నేపథ్యం..

మా సొంతూరు రాజంపేట మండలంలోని అర్గొండ. మా నాన్న రామారెడ్డిపేట సిద్దరాములు గంజ్‌లో గుమస్తాగా పనిచేశారు. ప్లంబర్‌గా, మెకానిక్‌గా, డ్రైవర్‌గా.. ఎన్నో వృత్తులు చేశారు. అమ్మ బీడీలు చుట్టేది. నాతోపాటు సోదరుడి కోసం వారు ఎంతో శ్రమించారు. చదువుల కోసం ఆస్తులు కూడా అమ్మారు. బాగా చదివి మంచి కొలువు సాధించు బిడ్డా అంటూ నిరంతరం ప్రోత్సహించారు.



తల్లిదండ్రులతో రజనీకాంత్

విద్యాభ్యాసం..

ప్రాథమిక విద్య కామారెడ్డిలోని వాసవి స్కూల్‌లో, అనంతరం టెన్త్ వరకు మెదక్‌లో స్కూల్‌లో చదివా. ఏపీఆర్‌జేసీ రాసి ఉమ్మడి రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించి నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశా. తర్వాత ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ బీఏ హిస్టరీ, హానర్స్ చదివా. ఇగ్నో యూనివర్సిటీ నుంచి ఎంఏ హిస్టరీ పట్టా సాధించా. యూజీసీ నెట్ కూడా పాసయ్యా. 2016 నుంచి 2018 వరకు హైదరాబాద్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో టీచింగ్ ప్రొఫెషన్‌లో పనిచేశా. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ స్కూళ్లలో టీచింగ్ ప్రొఫెషన్ కోసం నిర్వహించిన పరీక్షల్లో పాసై, రూ.11 లక్షల ప్యాకేజీతో అవకాశం వచ్చినా.. సివిల్స్ మీద ఆసక్తితో దాన్ని వద్దనుకుని ఢిల్లీ బాట పట్టా. పరుగు పందెంలో స్టేట్ లెవల్‌లో ప్రతిభ కనబరిచా. 400 మీటర్లు, 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో స్టేట్ లెవల్‌లో పతకాలూ సాధించా. పోలీస్ ఆఫీసర్ కావాలనుకోవడానికి అథ్లెటిక్స్ మీద ఉన్న ఆసక్తి కూడా ఓ కారణమే..

ఆత్మవిశ్వాసంతో ముందుకు..

సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేందుకు 2018లో ఢిల్లీకి వెళ్లాను. అక్కడే ఉండి చదువుకున్నాను. వరుసగా ఐదు ప్రయత్నాలు చేసినా సక్సెస్ రాలేదు. అయినా కుంగిపోలేదు. మరింత పట్టుదలతో చదివాను. తొలినాళ్లలో కోచింగ్ కోసం జాయిన్ కాగా నచ్చకపోవడంతో మానేశా. సొంతంగా రోజూ ఎనిమిది గంటలు చదివా. ఆరేళ్ల పాటు చదువు మీదే ధ్యాస పెట్టా. సివిల్స్ కొట్టాలన్న లక్ష్యంతో చదివాను. అపజయం ఎదురైనప్పుడు సమీక్షించుకుని, మళ్లీ ఆ పొరపాటు జరగకుండా ముందుకు సాగు తూ వెళ్లాను. చివరి ప్రయత్నంలో 587 వ ర్యాంకు సాధించాను.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత..

పోలీసులంటే సామాన్యుడు భయపడే పరిస్థితి పోయి ఫ్రెండ్లీ వాతావరణం ఏర్పడాలి. అంతేగాక సామాన్యుడు కూడా నేరుగా పోలీస్ ఉన్నతాధికారిని కలిసే పరిస్థితి ఉండాలి. నేను పోలీస్ అధికారినైతే అలాగే వ్యవహరించాలని అనుకునేవాడిని. శిక్షణ పూర్తి చేసుకుని, పోలీస్ అధికారిని అయ్యాక నేను కోరుకున్న పద్ధతిలో నడుచుకుంటాను. పేద, ధనిక, సామాన్యుడు, వీఐపీ అనే తేడా లేకుండా అందరినీ సమానంగా చూస్తా.

ఎంతో సంతోషంగా ఉంది

పిల్లలు ఉన్నతంగా ఎదగాలని అందరు తల్లిదండ్రుల్లాగే మేమూ కోరుకున్నాం. వాళ్ల చదువులకు లోటు రాకుండా చూశాం. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుంటే అప్పులు చేసి కూడా సర్దుబాటు చేశాం. సివిల్స్‌కు ఎంపికవడం సంతోషంగా ఉంది.

– పద్మ, సిద్ధరాములు, రజనీకాంత్ తల్లిదండ్రులు

క్లుప్తంగా

అవిశ్వాసానికి ముందే నల్లవెల్లి చైర్మన్‌ రాజీనామా



ఇందల్వాయి: సొసైటీ సభ్యులు పెట్టిన అవిశ్వాసానికి ముందే నల్లవెల్లి చైర్మన్‌ తన పదవికి రాజీనామా చేశారు. నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌, ఉమ్మడి జిల్లా ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ సంబారి మోహన్‌పై ఇటీవల నల్లవెల్లి సొసైటీ సభ్యులు అవిశ్వాసానికి దిగగా డీసీవో శ్రీనివాసరావు సొసైటీలో శుక్రవారం ఉదయం బలపరీక్ష నిర్వహించారు.ఇదిలా ఉండగా సొసైటీ కార్యాలయానికి చేరుకున్న సంబారి మోహన్‌ డీసీవోకు తన రాజీనామా లేఖను అందించారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామాను ఆమోదించిన డీసీవో ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రస్తుత వైస్‌ చైర్మన్‌ రమేశ్‌ని నియమించారు. అనంతరం సంబారి మోహన్‌ మాట్లాడుతూ.. తన పదవి కాలంలో ఎక్కడా ఎలాంటి పొరపాటు చేయలేదని అన్నారు.

యూపీఎస్సీలో వేల్పూర్‌ వాసికి 196 ర్యాంకు



వేల్పూర్‌: మండల కేంద్రానికి చెందిన జి అక్షయ దీపక్‌ ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియాలో 196వ ర్యాంకు సాధించాడు. దీపక్‌ తల్లిదండ్రులు వేల్పూర్‌ వాస్తవ్యులు కాగా చాలా ఏళ్ల క్రితం వారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అక్షయ దీపక్‌ బీటెక్‌, ఎంటెక్‌ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదివి, సివిల్‌ సర్వీసు పరీక్షలకు సిద్ధమై 196వ ర్యాంకు సాధించాడు. అక్షయ దీపక్‌ సివిల్స్‌లో ర్యాంకు సాధించడం పై వేల్పూర్‌ జెడ్పీటీసీ భారతి రాకేశ్‌చంద్ర, రిటైర్డు టీచర్లు గంగాధర్‌గౌడ్‌, సి.ప్రకాశ్‌, సయ్యద్‌ ఇస్మాయిల్‌, చంద్రశేఖర్‌గౌడ్‌, సుధాకర్‌, ప్రమోద్‌, మనోహర్‌, రవీందర్‌, సత్యనారాయణ, గంగాధర్‌ హర్షం వ్యక్తం చేశారు.



ధర్పల్లిలో విరిగిన విద్యుత్‌ స్తంభం



బోర్గాం శివారులో వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు



రెంజల్‌లో ధాన్యం కుప్ప నుంచి నీటిని తొలగిస్తున్న మహిళ



ఇందల్వాయిలో వర్షం ధాటికి కొట్టుకుపోయిన ధాన్యం



నందిపేట మండలం వెల్మల్‌లో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌



ఆలూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

కూలిన చెట్లు.. విరిగిన స్తంభాలు

- పలు గ్రామాల్లో భారీ వర్షం
- తడిచిన ధాన్యం
- ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పు రేకులు
- కుద్వాన్‌పూర్‌లో పిడుగుపాటుకు మూడు గేదెలు మృతి

సాక్షి, నెట్‌వర్క్‌: బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో భారీ చెట్లు నెలకొరిగాయి. విద్యుత్‌ స్తంభాలు విరిగిపోవడంతో వైర్లు తెగిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. ధర్పల్లిలో విద్యుత్‌ స్తంభం విరిగిపోగా, గుడి తండాలో విద్యుత్‌ స్తంభం నేలకొరిగింది. ఆలూర్‌ మండల కేంద్రంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఇందల్వాయి మండల కేంద్రంలో వర్ష బీభత్సానికి వడ్లు, నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఇళ్లపై వేసిన రేకులు ఎగిరిపోయాయి. నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్‌లో పిడుగు పాటుకు మూడు గేదెలు మృతి చెందాయి. చింరాజ్‌పల్లిలో మామిడి చెట్టు నేలకొరిగాయి. వెల్మల్‌లో వడగళ్ల వానతో తాగునీటిని సరఫరా చేసే వాటర్‌ ట్యాంకు దెబ్బతింది. నవీపేట శివారులో చెట్టు విరిగిపడగా, అభంగపట్నం శివారులో ధాన్యం తడిసింది. రెంజల్‌ మండలం బోర్గాం శివారులో వర్షం తీవ్రంగా కురిసింది. ధాన్యం కుప్పలపై వేసిన టార్పాలిన్‌లు గాలులకు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసింది. దీంతో ధాన్యం కుప్పలో నిలిచిన నీటిని రైతులు తొలగించారు. నందిపేట మండలంలోని రైతుఫారం, ఎన్‌టీఆర్‌ కాలనీలో రెండు విద్యుత్తు స్తంభాలు విరిగిపోగా, వెల్మల్‌ శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌, స్తంభాలు విరిగిపోయాయి. మాక్లూర్‌ మండలం వల్లభాపూర్‌లో ధాన్యం కుప్పల్లోకి నీరు చేరడంతో రైతులు వాటిని తొలగించారు.



చింరాజ్‌పల్లిలో నేలకొరిగిన మామిడి చెట్టు



గుడి తండాలో నేలకు ఒరిగిన విద్యుత్‌ స్తంభం



మెగ్యా నాయక్‌ తండాలో దెబ్బతిన్న నువ్వు పంట



బోర్గాంలో కురుస్తున్న వర్షం



గుట్ట కింది తండాలో ఈదురుగాలకు ఇంటి కప్పు ఎగిరిపోయిన దృశ్యం



బర్దీపూర్‌లో ఈదురుగాలులకు ఊగుతున్న చెట్లు



నవీపేట శివారులో నేల కూలిన చెట్టు



గుట్ట కింది తండాలో పొలంలో ఎగిరిపడ్డ రేకులు



కుద్వాన్‌పూర్‌లో మృతి చెందిన గేదెలు

బోధన్‌-బీదర్‌ రైల్వే లైన్‌కు కృషి చేస్తా

- జహీరాబాద్‌ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌



వర్నిలో మాట్లాడుతున్న సురేశ్‌ షెట్కార్‌

రుద్రూర్‌: బోధన్‌-బీదర్‌ రైల్వే లైన్‌ ఏర్పాటుకు కృషి చేస్తానని జహీరాబాద్‌ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌ అన్నారు. చందూర్‌, వర్ని, కోటగిరి మండల కేంద్రాల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం నిర్వహించిన పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు బోధన్‌-బీదర్‌ రైల్వే లైన్‌ సర్వే చేయించి ఎస్టిమేట్‌ వేయించానని, ఆ తర్వాత ఎంపీగా వచ్చిన బీబీ పాటిల్‌ దాని గురించి పట్టించుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బోధన్‌ ఎన్‌ఎస్‌ఎఫ్‌ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో పార్టీ బాన్సువాడ సెగ్మెంట్‌ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌ రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఇందూర్‌ చంద్రశేఖర్‌, పార్టీ మండలాల అధ్యక్షులు తోట అరుణ్‌కుమార్‌, సురేశ్‌బాబా, పుప్పాల శంకర్‌, షాహీద్‌, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమ పాలన

- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్‌ బోధన్‌ ఎంపీపీ సావిత్రి రాజేశ్వర్‌



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌ ప్రభుత్వ పాలనతోనే సాధ్యమవుతుందని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి అన్నారు. నగర కేంద్రంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో సాలూర మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్‌ బోధన్‌ ఎంపీపీ బుద్దె సావిత్రి ఆమె భర్త పార్టీ సీనియర్‌ నాయకుడు బుద్దె రాజేశ్వర్‌, భవానీపేట మాజీ సర్పంచ్‌ కృష్ణ, 100 మంది బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు, బోధన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు, మున్సిపల్‌ 10వ వార్డు కౌన్సిలర్‌ సావిత్రి భర్త గంగాధర్‌ గౌడ్‌ కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌ బిన్‌ హందాన్‌, పీసీసీ డెలిగెట్‌ గంగాశంకర్‌, పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, నాయకులు గణపతిరెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు ఇల్తెపు రమేశ్‌, కేజీ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో యువతులు



నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌నగర్‌ మండలంలోని నర్వ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కుస్తీ పోటీల్లో యువ మహిళ మల్లయోధులు పోటీపడ్డారు. వరంగల్‌కు చెందిన రమ్య, మహబుబాద్‌కు చెందిన బాలమణి పురుషులతో సమానంగా కుస్తీ పోటీల్లో తలపడ్డారు. మహిళల కుస్తీ పోటీలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. మహిళా మల్లయోధులకు కుస్తీ పోటీల నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు.

ఐడీసీఎంఎస్‌ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి..?

- చైర్మన్‌ రాజీనామాతో ఖాళీ అయిన పదవి
- నేడో, రేపో అధికారికంగా అందనున్న ఉత్తర్వులు

సుభాష్‌నగర్‌: ఇందూరు జిల్లా కో-ఆపరేటివ్‌ మార్కెటింగ్‌ సొసైటీ (ఐడీసీఎంఎస్‌) ఇన్‌ఛార్జి చైర్మన్‌గా వైస్‌ చైర్మన్‌ ఇంద్రసేనారెడ్డికి (బీబీపేట్‌ సొసైటీ చైర్మన్‌) బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది. ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ సాంబారు మోహన్‌ నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌ పదవికి రాజీనామా చేయగా, డీసీవో శ్రీనివాస్‌రావు ఆమోదం తెలిపారు. దీంతో ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌, మార్క్‌ఫెడ్‌ రాష్ట్ర డైరెక్టర్‌ పదవులను సాంబారు మోహన్‌ కోల్పోయారు. చైర్మన్‌ స్థానం ఖాళీ కావడంతో నూతన చైర్మన్‌ను ఎన్నుకునే వరకూ ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్‌ చైర్మన్‌ ఇంద్రసేనారెడ్డి వ్యవహరించనున్నారు. అధికారిక ఉత్తర్వులు అందిన వెంటనే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

చైర్మన్‌ పదవికి పోటీ..!

ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ పదవిని ముగ్గురు డైరెక్టర్లు ఆశిస్తున్నట్లు సమాచారం. ఇద్దరు జిల్లాకు చెందిన వారు కాగా, మరొకరు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు. ప్రస్తుతం వారంతా కాంగ్రెస్‌ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఎన్నికలకు మరో 10 నెలలు మాత్రమే గడువుంది. కాగా ఎన్‌డీసీసీబీ, ఐడీసీఎంఎస్‌ ఉమ్మడి జిల్లాల పరిధిలోకి వస్తాయి.

ఒక పదవి నిజామాబాద్‌, మరో పదవి కామారెడ్డి జిల్లా వారిని ఎన్నుకోవడం ఆనవాయితీ. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్‌గా నిజామాబాద్‌కు చెందిన కుంట రమేశ్‌రెడ్డి ఉన్నారు. ఈ క్రమంలో ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ పదవిని కామారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తిని ఎన్నుకుంటారని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అదేవిధంగా నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలు చెరో పార్లమెంట్‌ స్థానం పరిధిలో ఉన్న నేపథ్యంలో సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అధికార పార్టీ నాయకులు ఆచితూచి వ్యవహరించాల్సి ఉంది.

బీఆర్‌ఎస్‌ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ ఆస్తులు



సుభాష్‌నగర్‌: బీఆర్‌ఎస్‌ నిజామాబాద్‌ ఎంపీ అభ్యర్థిగా రూరల్‌ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అఫిడవిట్‌లో తనతో పాటు కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తుల వివరాలను వెల్లడించారు.

- బాజిరెడ్డి గోవర్ధన్‌ వద్ద ప్రస్తుతం రూ.2 లక్షల నగదు, ఆయన భార్య వినోద వద్ద రూ.2 లక్షల నగదు ఉంది.
- బాజిరెడ్డి గోవర్ధన్‌ పేరిట రూ.కోటి 96 వేల చరాస్తులు, స్థిరాస్తులు రూ.2.80 కోట్లు ఉన్నాయి. భార్య పేరుపై రూ.13.41 లక్షల చరాస్తులు, రూ.35.50 లక్షల స్థిరాస్తులు ఉన్నాయి.
- బాజిరెడ్డి పేరుపై ఎలాంటి అప్పులు, బ్యాంకు రుణాలు లేవు.
- బాజిరెడ్డి గోవర్ధన్‌తోపాటు ఆయన భార్య పేరుతో హైదరాబాద్‌, సంగారెడ్డి, నిజామాబాద్‌లో ఓపెన్‌ ప్లాట్లు ఉన్నాయి. నిజామాబాద్‌ జిల్లాలో వ్యవసాయ, నాన్‌ అగ్రికల్చర్‌ భూములు ఉన్నా యి. నిజామాబాద్‌, చీమన్‌పల్లిలో రెండు సొంత ఇండ్లు ఉన్నాయి.
- బాజిరెడ్డి గోవర్ధన్‌కు 50 తులాలు, ఆయన భార్యకు మరో 50 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి.
- బాజిరెడ్డికి రూ.30 లక్షల విలువ చేసే జీపు ఉంది.

రూ. 60వేల నగదు పట్టివేత



భిక్కనూరు: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో హైదరాబాద్‌కు చెందిన చందర్‌ హరి ప్రసాద్‌ వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 60వేలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



గంగవ్వ

బాన్సువాడ రూరల్‌: బంధువుల విందుకు హాజరైన ఓ మహిళను మృత్యువు కబళించింది. కిరాణ దుకాణంలో పూజకు అవసరమయ్యే సామగ్రిని కొనుగోలు చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో అతివేగంగా వస్తున్న వాహనం సదరు మహిళను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో చోటు చేసుకుంది. సీఐ మున్నూరు కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం కుర్తి గ్రామానికి చెందిన పోతరాజు గంగవ్వ(60) బాన్సువాడ మండలంలోని తాడ్కోల్‌లో తమ బంధువులు నిర్వహించిన కందూరు విందుకు శుక్రవారం హాజరైంది. పెద్దదేవుని దర్గాలో పూజకు అవసరమయ్యే సామగ్రిని కొనుగోలు చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో బాన్సువాడ వైపు వేగంగా వెళ్తున్న తుఫాను వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో గంగవ్వ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తమ్ముడు సాయిలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

మాచారెడ్డి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్సై రామేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గజ్జనాయక్‌ తండాకు చెందిన లక్ష్మణ్‌(36) గురువారం బహిర్భూమికని వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. మండల కేంద్రంలోని ఊర చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..

ఎడపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మంగళ్‌పాడ్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలెపల్లి ఇంద్రజ(48)కు ముగ్గురు సంతానం. వీరు ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతక్రుదయం ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఇంద్రజ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



మోపాల్‌: మండలంలోని మంచిప్పకు చెందిన గాండ్ల భూదేవి (68) వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూదేవి తూనికాకు కోసం గురువారం కొండెం చెరువు సమీపంలో ఉన్న గల అటవీ ప్రాంతానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో గ్రామస్తులు ఆమె కుమార్తెలు, అల్లుళ్లకు సమాచారమిచ్చారు. శుక్రవారం భూదేవి కోసం అటవీ ప్రాంతంలో వెతుకగా ఓ చెట్టు కింద మృతిచెంది ఉంది. వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి సయ్యద్‌ ఖదీర్‌ విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 మందికి రూ. 17,600 జరిమానా విధించగా ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. శుక్రవారం కుటుంబ సభ్యులు నిద్రలేచే సరికి అమ్మాయి తన గదిలో కనిపించకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఐదుగురికి గాయాలు

మాక్లూర్‌: మండలంలోని ధర్మారంలో శుక్రవారం సాయంత్రం చలి పిడుగు తగిలి ఐదుగురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో గ్రామ శివారులో ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పేందుకు వెళ్లిన సుంకరి ధర్మారం, సుంకరి నారాయణ, బన్నీ, సాకలి శంకర్‌పై చలిపిడుగు పడింది. దీంతో వారికి తిమ్మిర్లు వచ్చి అపస్మారకస్థితికి చేరుకున్నారు. గమనించిన స్థానికులు వారికి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దొంగతనం కేసులో ముగ్గురికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: బంగారు ఆభరణాలు దొంగిలించిన ఘటనలో ముగ్గురికి జైలు శిక్షను విధించినట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలం సుద్దులంకు చెందిన నీరడి అరుణ్‌, నీరడి రాజమణి, రెంజల్‌ మండలం కుర్నాపల్లికి చెందిన కొండపల్లి సావిత్రి, కోటగిరి మండలం కల్లూరుకు చెందిన సాయిలు 2022 మే 8న నగరంలోని గౌతంనగర్‌లో ఉన్న బోయిని పోచమ్మ ఇంటికి వెళ్లి ఇల్లు అద్దెకు కావాలని ఇంట్లోకి ప్రవేశించారు. వీరు పోచమ్మపై ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించి గొంతు నులిమి హత్య చేశారు. నిందితులపై సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. విచారణలో అరుణ్‌, సాయిలు, రాజమణి దొంగతనం చేసినట్లు రుజువు కావడంతో వీరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు దొంగసొత్తు కలిగి ఉన్నందున మరో రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వేయి జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. కాగా పోచమ్మ పోస్టుమార్టంలో సహజ గుండెజబ్బుతో మృతి చెందినట్లు రిపోర్టు రావడంతో నిందితులపై హత్య నేరం కాకుండా దొంగతనం, దొంగసొత్తు కలిగి ఉన్నందున కేసు నమోదు చేసి శిక్షను విధించినట్లు జడ్జి పేర్కొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

రెంజల్‌: పూడ్చిపెట్టిన మృతదేహానికి కొల్లూర్‌ పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండలంలోని సాటాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీరయ్య(48) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పని చేస్తున్న ప్రదేశంలో భవనంపై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనపై సైబరాబద్‌ కమిషనరేట్‌ పరిధిలోని కొల్లూర్‌ పీఎస్‌లో కేసు నమోదైంది. గాయపడిన గీరయ్యను కుటుంబీకులు గ్రామానికి తీసుకొచ్చి వైద్య చికిత్సలు అందించారు. ఇంటి వద్ద చికిత్స పొందుతూ 15 రోజుల క్రితం మృతిచెందాడు. కుటుంబీకులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న కొల్లూర్‌ పోలీసులు శుక్రవారం గ్రామానికి చేరుకొని కేసు విషయమై పూడ్చిపెట్టిన మృతదేహానికి డాక్టర్లు, ఫోరెన్సిక్‌ నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి) శివారులో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దాడి చేసినట్లు ఎస్సై సంజీవ్‌ శుక్రవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు వ్యభిచార గృహంపై దాడి చేయగా ఓ విటుడు, విటురాలిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్వాహకురాలు పర్వీన్‌ బేగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.